క్లుప్తంగా

మద్దిపాటికి బాలరాజు పరామర్శ



నీలావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

కొయ్యలగూడెం : గవరవరం మాజీ సర్పంచ్ మద్దిపాటి రాజ్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బుధవారం పరామర్శించారు. రాజకుమార్ తల్లి రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నీలావతి ఇటీవల మృతి చెందడంతో చొప్ప రామన్నగూడెంలో మద్దిపాటి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రజ్ఞావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత నీలావతికి ఉందని బాలరాజు పేర్కొన్నారు. రాజకుమార్‌కు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, నాయకులు గంటా రమేష్, తగరం ఆశీర్వాదం, ఎస్‌కే బాజీ, చిక్కాల దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు లక్ష చామంతుల పూజ



జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది అంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి లక్ష చామంతులతో లక్షార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు మంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న దృశ్యం

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ డిజిటల్ క్లాస్ రూమ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు, ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు సాంకేతిక విద్యా పరిజ్ఞానం ఎంతైనా అవసరమని, దాతల సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయటం సంతోషదాయకమని, కళాశాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసిన దాతలను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, విజయ్ కృష్ణ, ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కొయ్యలగూడెం: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఈ నెల 29వ తేదీ కొయ్యలగూడెం సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈ పీర్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. సీజీఆర్‌ఎఫ్, ఏపీ ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెం సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై నేరుగా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చన్నారు.

కులమతాలకు అతీతంగా వన భోజనాలు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో చెరువు గట్టుపై ఉన్న కట్టమహాలక్ష్మమ్మ గుడి వద్ద బుధవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. గ్రామంలోని అందరూ కులమతాలకు అతీతంగా వన భోజనాల్లో పాల్గొని, ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చింతలపూడి అభివృద్ధికి కృషి

చింతలపూడి: చింతలపూడి అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నాగిరెడ్డిగూడెం ఆలపాటి సత్యనారాయణ గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన వన సమారాధనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పార్థసారధి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

లింగపాలెం: ధర్మాజీగూడెంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మిరప పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి ఎండీ షాఫియా పర్వీన్ మాట్లాడుతూ మిరప పంటలో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు.

మొక్కజొన్న సాగుకు ఇదే అదును

- జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు ఖాయం
- నియోజకవర్గంలో 1120 హెక్టార్లలో మొక్కజొన్న సాగు



మొక్కజొన్న పంట



మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

బుట్టాయగూడెం: ఏజెన్సీలో వరి, పొగాకు తర్వాత అత్యధికంగా పంటల మార్పిడిలో భాగంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఈ పంట ఏడాదికి రెండు సార్లు వేసుకోవచ్చు. ఈ పంటను వర్షాధారంగానూ, సాగునీటి కింద పండించే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న సాగును చేపట్టారు. జూన్, జులైలలో వేసిన పంట చేతికి రావడంతో నవంబర్, డిసెంబర్‌లలో రెండో పంటను రైతులు వేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయాధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మొక్కజొన్న సాగుపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీర్ఘకాల రకాలైతే 100-120 రోజులకు పంట చేతికి వస్తుందని మధ్యకాల రకాలైతే 90-100 రోజులకు, స్వల్ప కాలిక రకాలైతే 90 రోజులలోపే మొక్కజొన్న పంట చేతికి వస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అలాగే ఈ నేపథ్యంలో మొక్కజొన్న పంట సాగుకు సంబంధించి పలు విషయాలు కూడా మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు వివరించారు.

పంటల్లో కలుపు నివారణ

పంట విత్తాక 40 రోజుల వరకూ కలుపు లేకుండా చూసుకోవాలి. అలాగే మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800-1200 గ్రాముల అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట వేసిన వెంటనే లేదా మూడు రోజుల్లోగా పిచికారీ చేసుకోవాలి. వెడల్పు కలుపు మొక్కల నివారణకు విత్తన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2.4-డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేసుకోవాలి.

ఎరువుల వినియోగం ఇలా

ఎకరాకు సంకర జాతి విత్తనాలైతే 7 నుంచి 8 కిలోల విత్తనం సరిపోతుంది. ఎకరాకు 72-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులు వాడాలి. మొత్తం ఎరువులు పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒక వేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ 20 గ్రాములను నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

మొక్కజొన్న సాగులో నీటి తడులు

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వీలున్న చోట నీరు తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, దింజలు ఏర్పడే దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

నియోజకవర్గంలో 1120 హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో ప్రస్తుతం రబీలో 1120 హెక్టార్లలో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సాగు రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నామని చెప్పారు.

పంటలో సస్యరక్షణ తప్పనిసరి



పైరు తొలిదశలో ఆశించే మువ్వ తొలిచే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10-12 రోజులకు పైరుపై మోనోక్రోటోపాస్ 1.6 ఎమ్ఎల్ లేదా కోరాలిన్ 3 ఎమ్ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చెయ్యాలి. పొడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువన ఉన్న రెండు మూడాకులు తుంచి ప్రొపికోనజోల్ ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చెయ్యాలి.

– డి. ముత్యాలరావు, వ్యవసాయాధికారి, బుట్టాయగూడెం మండలం

గిరిజన పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కుక్కునూరు: ట్రైబల్ వెల్ఫేర్ జీపీఎస్ పాఠశాలలకు నిధులు మంజూరు చేసి, గిరిజన పాఠశాలలను అభివృద్ధి చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కూన కమల్‌కుమార్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సమావేశంలో కమల్ కుమార్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఐటీడీఏ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ జీసీఎస్ పాఠశాలలకు ఎటువంటి నిధులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాణారి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు వాంకుడోత్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తాడేపల్లి శ్రీను, కీసర సాంబశివరావు, శాలి రవికుమార్, కరుణానిధి, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

టి.నరసాపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన మండలంలోని తెడ్లం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలివీ.. తెడ్లం గ్రామంలో నివాసం ఉంటున్న కాగితాల వెంకటేశ్వరమ్మ బుధవారం వేరే గ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని ఏసీ, టీవీ, మరికొన్ని ఎలక్ట్రానిక్ గృహోపకరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు వారు తెలిపారు. ఘటనా స్థలాన్ని వీఆర్‌వో ఆంజనేయులు పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన నాయకులు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో చింతలపూడి వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతలపూడి: విజయవాడ తాడేపల్లి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చింతలపూడి మండల నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, 2029లో మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబునాయక్, సీనియర్ నాయకులు గిరి భోగారావు, మామిళ్లపల్లి రాంబాబు, యర్రంశెట్టి రామకృష్ణారావు, మోరంపూడి శ్రీనివాసరావు, గడ్డమడుగుల రాజేష్‌నాయుడు, గద్దే ప్రసాద్ ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్

కామవరపుకోట : ద్వారకా తిరుమలలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కామవరపుకోట మండలం వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ నానాది సాగర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నానాది సాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే వ్యక్తులు, విగ్రహాలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే, అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయటం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ద్వారకాతిరుమల: స్థానిక పంచాయతీ పార్కులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి, సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ నాయకులు అంబటి నాగేంద్రప్రసాద్, పాము మాన్‌సింగ్‌లతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. ధ్వంసమైన విగ్రహ స్థానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ జీవీ సుబ్బారావును ఆయన కార్యాలయంలో కలిసి అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా సంతోష్ విలేకరులతో మాట్లాడారు.

మెరుగైన నష్టపరిహారం చెల్లించాలి



రైతులతో చర్చిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి

చింతలపూడి: ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు మెరుగైన నష్టపరిహారం చెల్లించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటికి విజ్ఞప్తి చేశారు. చింతలపూడి తహసీల్దారు కార్యాలయంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి బుధవారం సమావేశం నిర్వహించారు. భూసేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులతో చర్చించారు. ఎకరాకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని సమావేశంలో రైతులు ఏకగ్రీవంగా అధికారులకు తేల్చి చెప్పారు. ముక్కంటి మాట్లాడుతూ రైతుల వినతులను ప్రభుత్వానికి తెలియజేస్తామని, మరోసారి సంబంధిత మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారి సోమశేఖర్, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితుల పోరాట సమితి కార్యదర్శి చిట్లూరి అంజిబాబు, రైతులు గోలి రామకష్టారెడ్డి, కొనకళ్ల కష్ణమూర్తి, సాదరబోయిన వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



రామాలయం వద్ద కార్తీకదీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కార్తీకమాసం సందర్భంగా శ్రీరామ్ నగర్ వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద కార్తీక దీపోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హనుమాన్ చాలీసా దేవతా పారాయణ స్తోత్రాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గుడిపూడి శేషాచార్యులు మరియు పాలక మండలి సభ్యులు ఇల్లా లక్ష్మణరావు, పేరు బోయిన రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పోలవరం రూరల్ : పట్టిసీమలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో



జంగారెడ్డిగూడెం: రైతులకు సూచనలిస్తున్న ఏవో పోశారావు



బుట్టాయగూడెం : పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

బుట్టాయగూడెం: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వరిసాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ డి.ముత్యాలరావు తెలిపారు. మండలంలోని దొరమామిడి, లక్ష్మిడుగూడెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రాశుల మీద, కల్లాల్లో ఉంటే వాటిని రైతులు సురక్షిత ప్రదేశాల్లో భద్ర పరచుకోవాలని సూచించారు. అలాగే రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సహాయకులు కుసుమ, మౌనిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలి

జంగారెడ్డిగూడెం: రానున్న రెండు, మూడు రోజుల్లో తుఫాను ప్రభావం ఉన్నందున వరి రైతులు ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలిన మండల వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు అన్నారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేసి వరి కోతలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలో వరిసాగు విస్తీర్ణం 11,200 ఎకరాలని, ఇప్పటి వరకు 4110 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు తెలిపారు. దీనికి సంబంధించి 3500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. రాబోయే మూడు రోజుల్లో తుఫాన్ ప్రభావం ఉండటంతో వరి కోతలు కోయని రైతులు వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. బస్తాలు, రాశులుగా ఉన్న ధాన్యం 2000 మెట్రిక్ టన్నులు ఉంటాయని, వాటిని త్వరితగతిన కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

టార్పాలిన్లతో భద్రపరుచుకోవాలి

లింగపాలెం: తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి ధాన్యాన్ని టార్పాలిన్లతో భద్రపరుచుకోవాలని వ్యవసాయశాఖ సంచాలకులు నాగకుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని ధర్మాజీగూడెం, కలరాయనగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి పర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కోతలను వాయిదా వేసుకోవాలి

పోలవరం రూరల్: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ ఆర్ఎస్ రాజు సూచించారు. పోలవరం మండలంలో ధాన్యం రాశులు ఉన్న ప్రదేశాలను ఆయన వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబుతో కలిసి బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 75 వేల గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు సంచులను తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 817 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని, 1590 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించారని తెలిపారు.

4 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవాలు



ఉత్సవ ఏర్పాట్లను చేస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 4 నుంచి 10 వరకు స్వామివారి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని, పరిసరాలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఆలయం ముందు చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో తేదీ ఉదయం తొమ్మిదిన్నర గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. ఐదో తేదీన పుణ్యాహవాచనం, అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, ఆరో తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యొపాసనను నిర్వహిస్తారు. ఏడో తేదీ రాత్రి ఏడు గంటల నుంచి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే ఎనిమిదో తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యొపాసన, సాయంత్రం నెమలి వాహనంపై గ్రామోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు. తొమ్మిదో తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యొపాసన, బలిహరణ, పూర్ణాహుతి, అవబృధస్నానం, వసంతోత్సవం, ధ్వజావరోహణ వేడుకలను నిర్వహిస్తారు. పదో తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ద్వాదశి ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగోత్సవ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడుతాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

చింతలపూడి: ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలకైనా సిద్ధమని, వన సంరక్షణ సమితులకు కేటాయించిన భూముల్లో వీఎస్ఎస్ సభ్యులకు హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా భూ సంస్కరణ చట్టం ద్వారా వన సంరక్షణ సమితులు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముల్లగిరి లాజరు, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్.కె కాలేషా, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

వేలేరుపాడు : డిసెంబర్ పదో తేదీన వేలేరుపాడులో నిర్వాసితుల మహాసభ నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము అన్నారు. సమావేశంలో కారం దారయ్య, పిట్టా వీరయ్య, కురిమెళ్ల వెంకటేశ్వరరావు, బంధం నాగేశ్వరావు, మడివి కామయ్య, పెర్ల వెంకటేశ్వరరావు, పిట్టా జయ పాల్గొన్నారు.

హమాలీలకు పెరిగిన కూలి రేట్లు

హమాలీలకు చెల్లించే కూలి రేట్లు పెరిగినట్లు సీపీఐ మండల కార్యదర్శి నాయకులు బాడిస రాము తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు గోపాలకృష్ణ, శాఖమూరి సురేష్, పాలడుగుల సురేందర్, పసుమర్తి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు



ఓ పచారీ దుకాణంలో నిర్భయంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు

కొయ్యలగూడెం: బెల్టు కనిపిస్తే ఊరుకోం అని ప్రచారం చేస్తున్న ప్రకటనలు కేవలం ప్రచారానికి అనేలా ఎద్దేవా చేస్తూ యథేచ్ఛగా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. కొయ్యలగూడెంలోని మెయిన్ సెంటర్‌తో సహా నలువైపులా జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులలో ఉన్న పచారీ షాపులలో మందుబాబులు నిర్భయంగా సేవిస్తున్నారు.

బిల్లులు మంజూరు కాగానే పనులు

సాక్షి స్పందన

జంగారెడ్డిగూడెం రూరల్: ఆఖరి మజిలీ 'అవస్థలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఆర్‌అండ్‌ఆర్ గృహ నిర్మాణ సంస్థ కనస్ట్రక్షన్ డివిజన్ కార్య నిర్వాహక ఇంజనీర్ ఉన్నతాధికారులకు బుధవారం నివేదిక సమర్పించారు. పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నుంచి వివరణ తీసుకుని జిల్లా పౌర సంబంధాల అధికారికి నివేదిక సమర్పించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఐదు శ్మశాన వాటికల నిర్మాణానికి రూ.1.55 కోట్లు మంజూరైనట్లు గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి జి.సత్యనారాయణ తెలిపారు. గతంలో కాలనీలో చేపట్టిన పనులకు గానూ కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల కాలేదని, సుమారు రెండు సంవత్సరాల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆ కారణంతోనే పనులు నిలుపుదల చేసినట్లు కాంట్రాక్టర్ గృహ నిర్మాణ సంస్థ కనస్ట్రక్షన్ డివిజన్ కార్య నిర్వాహక ఇంజనీర్‌కు వివరణ ఇచ్చారని జిల్లా అధికారి సత్యనారాయణ తెలిపారు. ఆర్‌అండ్ ఆర్ పనులకు బిల్లులు మంజూరు చేయగానే పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ వివరణ ఇచ్చినట్లు తెలిపారు.